క్లుప్తంగా

25న మున్సిపల్ సమావేశం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 25న చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



బడి ఈడు చిన్నారులతో ఎంఈఓ తదితరులు

మిర్యాలగూడ: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని మిర్యాలగూడ ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం నూనావత్‌తండాలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న కూలీలకు చెందిన ఆరుగురు పిల్లలు పాఠశాలకు వెళ్లకపోవడాన్ని గుర్తించి వారిని వెంటనే స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పరిపూర్ణచారి, సీఆర్పీ పాండు ఉన్నారు.

సాగర్‌డ్యాం రక్షణ సిబ్బందికి ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సంపత్

నాగార్జునసాగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగర్‌డ్యాం ఎస్పీఎఫ్(ప్రత్యేక రక్షణ దళం) సిబ్బందికి నిర్వహిస్తున్న ఆటల పోటీలను బుధవారం విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ ప్రారంభించారు. వాలీ బాల్, నెట్‌బాల్ తదితర ఆటలు ఆడతారు. ఇవే కాకుండా ఇండోర్‌గేమ్స్ ఆడనున్నట్లు ఎస్పీఎఫ్ ఆర్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఎస్‌ఐ రఘుబాబు పాల్గొన్నారు.

నేడు 'తమ్మినేని' రాక

మిర్యాలగూడ: పట్టణంలోని నల్లగొండ రోడ్డులో గురువారం ఏర్పాటు చేస్తున్న గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహావిష్కరణకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ బుధవారం తెలిపారు. ఈదులగూడెంలోని సుందరయ్య విగ్రహం నుంచి నల్లగొండ రోడ్డులోని గాదె శ్రీనివాస్‌రెడ్డి స్థూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

త్రిపురారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డు, ఆధార్‌లో అడ్రస్, పేర్లు, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్ మార్చుకోవడంతోపాటు కొత్త నంబర్ లింక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆధార్ సేవలు అందించబడతాయని తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అప్పగింత

వేములపల్లి(మాడ్గులపల్లి) : మాడ్గులపల్లి మండలంలోని ధర్మాపురానికి చెందిన మొగుళ్ల ధనమ్మ, కొయ్యగూడెంకు చెందిన వడ్డె సందీప్, ఆగామోత్కూర్‌కు చెందిన గంజి జితేందర్ ఇటీవల మొబైల్స్‌ను పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి మొబైల్స్‌ను ట్రాక్ చేసి బుధవారం బాధితులకు అందజేసామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

తోడేలు దాడిలో మేకలు మృతి

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని బుగ్గతండాలో తోడేలు దాడి చేయడంతో అదే గ్రామానికి చెందిన వాంకుడావత్ కుమార్‌కు చెందిన 12 మేకలు మృతిచెందాయి. బుధవారం అటవీ ప్రాంతంలో మేత మేస్తుండగా ఒక్కసారిగా మేకల గుంపుపై తోడేలు దాడి చేయడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. సుమారు రూ.90వేలు నష్టం వాటిల్లినట్లు వాంకుడావత్ కుమార్ వాపోయాడు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చందంపేట : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ చంద్రకళ అన్నారు. నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థినులకు బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. బాలికలకు సంబంధించి సమస్యలపై చైల్డ్ హెల్ప్ లైన్ నెం.1098కు కాల్ చేయాలని కోరారు. సమావేశంలో సూపర్‌వైజర్ శోభ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ జారీలో నూతన పంథా

- అదాయం రాబట్టేందుకు కొత్త మార్గం
- జియోట్యాగింగ్ చేసేలా చర్యలు

దేవరకొండ: మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన ట్రేడ్‌లైసెన్స్‌ల జారీలో ఇప్పటికే అధికార యంత్రాంగం నూతన పంథా అనుసరిస్తుంది.గతంలో క్షేత్ర స్థాయిలో ఉన్న దుకాణాలకు, లైసెన్స్‌లు పొందే దుకాణాల సంఖ్యకు పొంతన లేకుండా పోయేది. దీంతో పాత విధానానికి మున్సిపల్ శాఖ స్వస్తి పలికి నూతన విధానంలో అనుమతులు జారీ చేస్తుంది మున్సిపాలిటీలలోని ప్రధాన ప్రాంతాల్లో, అంతర్గత కాలనీల్లో ఉన్న వ్యాపార కేంద్రాల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి జియోట్యాగింగ్ చేసేలా చర్యలు చేపట్టింది. తద్వారా మున్సిపాలిటీలకు మరింత అదాయం రాబట్టేందుకు మార్గం సుగమమైంది.

సమస్యను అధిగమించేందుకు..

గతంలో మున్సిపాలిటీ పరిధిలో వేలాది దుకాణాలు ఉన్నా వందల్లోనే వ్యాపార అనుమతులు తీసుకునేవారు. ఒక్కో దుకాణం నుంచి సుమారు రూ 2,000 పైబడి రుసుం చెల్లించాల్సి ఉంటుంది.విభాగాలకు అనుగుణంగా రూ.12వేల వరకు రుసుం స్వీకరిస్తున్నారు.అతితక్కువగా



యజమానులు అనుమతులు పొందుతుండటంతో మున్సిపాలిటీల ఆదాయానికి గండి పడేదని పలువురు బాహాటంగానే పేర్కొంటున్నారు. పట్టణాల్లో వాణిజ్య దుకాణాలకు హరిత రుసుం లైసెన్స్ ఫీజుకు 10శాతం జత చేసి వసూలు చేస్తున్నారు. దుకాణ వైశాల్యం, దుకాణం ఉన్న ప్రదేశం అనుగుణంగా అధికారులు రుసుం నిర్దేశిస్తున్నారు.అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్ర స్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది.

జియోట్యాగింగ్ చేసేలా..

గతంలో పట్టణాల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా నెలకు రూ.లక్షల్లో ఆర్జిస్తున్న వారు కొందరైతే..నయాపైసా చెల్లించకుండా మున్సిపాలిటీల ఆదాయానికి గండి కొడుతున్న వారు మరికొందరు. ఇటువంటి వాటిని అధికమించేందుకు ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి దుకాణాన్ని ఫొటో తీసి వివరాలతో జియోట్యాగింగ్ చేసేలా చర్యలు చేపట్టారు. దేవరకొండ మున్సిపాలిటీలో గతంలో ట్రేడ్ లైసెన్స్ పొందిన వారి లైసెన్స్‌లను రెన్యువల్ చేస్తూ కొత్తగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలకు వ్యాపార లైసెన్స్‌లు జారీ చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

> **కొలతల ఆధారంగా పన్ను**
>
> 
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీల పరిధిలో వ్యాపార దుకాణాల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాము. వాటికి జియోట్యాగింగ్ విధానంలో కొలతల ఆధారంగా పన్ను ఖరారు చేస్తాం. దుకాణదారులు తప్పకుండా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదు.
>
> – వై.సుదర్శన్, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

బడుగుల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : బడుగుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. చందంపేట మండలంలోని గుంటిపల్లి, గన్నెర్లపల్లి, హంక్యతండా, ముర్పునూతల, దేవరచర్ల, యల్మలమంద, గువ్వలగుట్ట గ్రామాల్లో రూ.2కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. గుంటిపల్లిలో రూ.10లక్షలు, గన్నెర్లపల్లిలో రూ.5లక్షలు, హంక్యతండాలో రూ.5లక్షలు, ముర్పునూతలలో రూ.10 లక్షలతో, యల్మలమంద గేటు నుంచి తండా వరకు రూ.90లక్షలతో బీటీరోడ్డు, ఉస్మాన్‌కుంటలో సీసీ రోడ్డు, గువ్వలగుట్టలో ఆర్‌ఓఆర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేప్రారంభించి మాట్లాడారు. చందంపేట మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తిమేర కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, పీఆర్‌ఏఈ రాజు, నాయకులు మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, గోవిందుయాదవ్, మాజీ ఎంపీపీ పార్వతిచందునాయక్, చందంపేట మండల అధ్యక్షుడు జర్పుల బద్యానాయక్, మల్లారెడ్డి, శంకర్‌రావు, అనంతగిరి, సుక్కునాయక్, తిరుపతిరెడ్డి, మహాలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంటిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

సంత్ సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

మిర్యాలగూడ: సంత్‌సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ్‌నాయక్ కోరారు. బుధవారం సంఘం క్యాలెండర్ హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌నాయక్, ఏఎస్పీ రాములునాయక్ చేతుల మీదుగా అవిష్కరించారు. కార్యక్రమంలో తుకారాంనాయక్, ఆనంద్‌నాయక్, సీతా రాంనాయక్, మాత్రునాయక్, రవినాయక్ ఉన్నారు.

అనుమతి లేని విగ్రహాన్ని తొలగించాలి

మిర్యాలగూడ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల మున్సిపల్ పార్క్‌లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ అధికారులు ఆ విగ్రహానికి నోటీసులు అంటించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని స్థలంలో 2022లో పరిషత్ పాలకవర్గం, అధికారుల అనుమతి లేకుండా పార్క్‌ను నిర్మించి 23మార్చి 2023న అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ప్రారంభించారు. పార్క్‌కు మాజీ సర్పంచ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరునగరు గంగాధర్ పేరు పెట్టారు. అయితే పార్క్‌లో రెండుమూడు రోజుల క్రితం దిమ్మె నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పార్క్‌లో అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేశారనే ఫిర్యాదుతో విగ్రహాన్ని తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్, టీపీఓ వి.సోమయ్య, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, టీపీఎస్ అంజయ్యలు ముసుగులో ఉన్న విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహం పెట్టిన వారే తొలగించకుంటే తామే తొలగించక తప్పదని కమిషనర్ పేర్కొన్నారు. అధికారులు విగ్రహాన్ని పరిశీలిస్తున్న విషయం తెలుసుకుని మున్సిపల్ చైర్మన్ భార్గవ్ కమిషనర్‌కు ఫోన్ చేసినట్లు తెలిసింది.



మున్సిపల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్ నేత రంగశాయిరెడ్డికి కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి
- బాధిత కుటుంబానికి పలువురు ప్రజాప్రతినిధుల పరామర్శ
- తుమ్మడంలో విషాదఛాయలు

త్రిపురారం : నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందాడు. బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన రంగాశాయిరెడ్డి మృతదేహాన్ని నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామం నుంచి తుమ్మడం వరకు కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు ర్యాలీతో ఆయన ఇంటికి తీసుకెళ్లారు. ప్రజల సందర్శనార్థం మృతదేహాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నివాసంలో ఉంచి ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రజలకు అండగా ఉండే మనిషిని కోల్పోయామంటూ గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. తుమ్మడం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిడమనూరు మొదటి ఎంపీపీగా..

1987వ సంవత్సరంలో మండల వ్యవస్థ ప్రారంభం అయిన తరువాత మొదటి సారి జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో రంగశాయిరెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొంది నిడమనూరు ఎంపీపీగా ఎన్నికయ్యారు. 1999వ సంవత్సరంలో మిర్యాలగూడ నుంచి కాంగ్రెస్ నేత సుదిని జైపాల్ రెడ్డిపై రంగశాయిరెడ్డి తెలుగుదేశం పార్టీ తరుపున ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014–2019 మధ్య కాలంలో నిడమనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా పనిచేశారు. మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డికి రాజకీయంగా ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.

పలువురు నేతల పరామర్శ

మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లబోతు భాస్కర్ రావు, సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, యడవెల్లి విజయేందర్ రెడ్డి, నేతి విద్యాసాగర్, డీసీసీ కేతావత్ శంకర్ నాయక్, రాంరెడ్డి, మేరెడ్డి కేశవ రెడ్డి, విక్రం రెడ్డి, వేణు గోపాల్ రెడ్డిలు రంగశాయి రెడ్డి, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు గ్రామంలో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్ హయాంలోనే ఖిలా పార్క్ పూర్తి



పార్క్‌ను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

దేవరకొండ: బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే దేవరకొండ ఖిలా ఆవరణలో రూ.5కోట్లతో పార్క్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గాజుల ఆంజనేయులు అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పార్క్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నికల కోడ్ రావడంతో అప్పటి ప్రభుత్వం పార్క్‌ను ప్రారంభించలేకపోయిందని తెలిపారు. ఇటీవల పార్క్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లగాసు సత్యనారాయణ, బాబా, మాకం చంద్రమౌళి, ఏసోబు, మధు, రమేష్‌నాయక్, మురళి, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై కేసు

మిర్యాలగూడ : ఎమ్మెల్యే గన్‌మన్ విధులకు ఆటంకం కలిగించాడనే అభియోగం మేరకు అధికార పార్టీ నాయకుడిపై మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడకు చెందిన కాంగ్రెస్ పట్టణ నాయకుడు పాదిళ్ల వెంకన్న ఈ నెల 20న ప్రజా సమస్యలు విన్నవించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లాడు. ఈ క్రమంలో వెంకన్నను ఎమ్మెల్యే గన్‌మన్ అడ్డుకున్నాడు. ఎమ్మెల్యే పిలిచారని, తనను లోనికి అనుమతించాలని చెప్పినప్పటికీ గన్‌మన్ అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడి నుంచి వెళ్లిపోయిన వెంకన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గన్‌మన్ దౌర్జన్యం అంటూ ఎక్స్‌లో పోస్టు చేయడంతో వివాదమైంది. దీంతో విధులకు ఆటంకం కలిగించాడని గన్‌మన్ అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకన్నపై క్రైమ్ నంబర్ 10, 2025తో సెక్షన్ 221, 229 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వెంకన్న సహకరించలేదనే కోపంతోనే ఎమ్మెల్యే ఈ కేసులను నమోదు చేయించినట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది.

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఖమ్మం, వరంగల్, నల్లగొండ నియోజకవర్గ బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) డివిజన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం తపస్ క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర బాధ్యులు పెంటయ్య, పాపిరెడ్డి, రాములు, భాస్కర్ ఉన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ డే

కొండమల్లేపల్లి : విద్యుత్ వినియోగదారుల సమస్యలపై నల్లగొండలోని పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు, కరెంటు బిల్లు రశీదు తీసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఎన్ఆర్ఐ దంపతులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం రాళ్లవాగు తండాకు చెందిన ఎన్ఆర్ఐ (ఆస్ట్రేలియా) ధీరావత్ రాయమల్, ప్రవంతి దంపతులతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ దామరచర్ల మండల అధ్యక్షుడు దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు ఎండీ.యూసుఫ్, ఆంగోతు హాతీరాంనాయక్, బైరం సంపత్, కుందూరు వీరకోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, ధీరావత్ పున్నానాయక్, బాల సత్యనారాయణ లావూరి శ్రీనునాయక్, ధీరావత్ బాలాజీనాయక్, అశోక్‌నాయక్, చందర్‌భాను, రాజు, రాందాస్, లచ్చునాయక్, హరి, వెంకట్రామ్, అక్కురామ్‌నాయక్ పాల్గొన్నారు.



కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దఅడిశర్లపల్లి : సంగారెడ్డిలో ఈ నెల ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ కోరారు. బుధవారం మండలంలోని అజ్మాపురంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, బీవీ రాఘవులు, విజయరాఘవ, రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, గ్రామ కార్యదర్శి చిరంజీవి, కవిత ఉన్నారు.

వీఓఏలు బాధ్యతగా వ్యవహరించాలి : డీఆర్‌డీఓ



మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

త్రిపురారం : గ్రామాల్లో వీఓఏలు బాధ్యతగా ఉండాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు.సంఘం డబ్బులు సొంతాలకు వాడుకోవడం ఏంటని, శ్రీనిధి రుణాలు రికవరీ ఎందుకు చేయడంలేదని మహిళ సంఘాల సభ్యులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీనిధి కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, వీఓఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పని చేసే వీఓఏలు పద్ధతి మార్చుకొని, శ్రీనిధి, బ్యాంక్ లోన్‌ల రికవరీలను పెంచాలని ఆదేశించారు. త్రిపురారం మండలంలో రూ. 3 కోట్ల 15 లక్షల రుణాలు పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. వీఓఏల కోరిక మేరకు అడిగిన ఐడీ కార్డులు, సిమ్ములు, డ్రెస్ కోడ్‌లను పరిశీలించి అందించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి, ఏపీఎం అశోక్ కుమార్, సీసీ దేవ్ సింగ్, మురళి, హేమ నాయక్ పాల్గొన్నారు.

'ఆత్మీయ భరోసా' అందించాలని వినతి

గుర్రంపోడు : భూమి లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి వినోద్ కోరారు. బుధవారం ఈ మేరకు కొప్పోలు సభలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తూటుపల్లి రామకృష్ణ, బొంగరాల ప్రశాంత్, తేలుకుంట్ల రవికుమార్, పాలోజు సతీష్‌చారి,రామకృష్ణ పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు గ్రామంలో బుధవారం ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు. కొప్పోలు గ్రామానికి చెందిన పోలె వెంకన్న ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆందోళన చెందొద్దు.. మళ్లీ దరఖాస్తు చేసుకోండి

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ సూచన
- కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామ సభలు

మిర్యాలగూడ: అర్హుల జాబితాలో పేర్లు లేకుంటే ఆందోళన చెందొద్దని, మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ సూచించారు. మండలంలోని యాద్గార్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 26నుంచి నాలుగు కొత్త పథకాలు అమలు చేస్తుందని, వాటిలో లబ్ధిదారులు ఎంపిక చేసినందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి దేవ్‌సింగ్, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో శేషగిరిశర్మ, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ

ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ వర్తింప చేయడం జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 17వ వార్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవినాయక్, తిరుపతిరెడ్డి, కృష్ణమూర్తి, భీమేష్, నాగునాయక్, స్వాతి పాల్గొన్నారు.

అధికారుల నిలదీత

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో రెండోరోజు బుధవారం నిర్వహించిన ప్రజాపాలన సభల్లో తమ దరఖాస్తులు ఎటు పోయాయని పలువురు పేదలు అధికారులను నిలదీశారు. మున్సిపాలిటీలో 13వ వార్డు నుంచి 24వ వార్డు వరకు వార్డు సభలను నిర్వహించారు. పథకాలకు అనర్హులను ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈ వెంకన్న, సోమయ్య, అంజయ్య, వెంకటరమణ ఉన్నారు.



యాద్గార్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

హాలియా : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని హాలియా మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి అన్నారు. బుధవారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, 6వ వార్డు, 10వ వార్డులో వార్డు సభలు నిర్వహించారు. 10వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదే విధంగా అనుముల మండలంలోని పులిమామిడి, రామడుగు, శ్రీనాథపురం, పాలెం, చింతగూడెం, మారేపల్లి, యాచారం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్ పర్సన్ యడవెల్లి అనుపమా నరేందర్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, పాన్నారు.

దరఖాస్తులు ఇచ్చినా ఆన్‌లైన్ చేయలే..

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలంలోని రాజవరం గ్రామ సభ రసాభాసగా జరిగింది. బుధవారం గ్రామ ప్రత్యేక అధికారి శారద, ఇతర అధికారులు గ్రామసభకు హాజరయ్యారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేల్లో లబ్దిదారుల పేర్లను అధికారులు ప్రకటించడంతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజాపాలన సమయంలో దరఖాస్తులు చేసుకుంటే వాటిని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ చారి ఆన్‌లైన్ చేయకపోవడం ఏమిటని వారు అధికారులను నిలదీశారు.



మిర్యాలగూడ : ముత్తిరెడ్డికుంటలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

రెండవ రోజు కొనసాగిన గ్రామ సభలు

అడవిదేవులపల్లి : ప్రజాపాలన గ్రామ సభలు బుధవారం రెండవ రోజు ప్రశాంతంగా సాగాయి. ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ఇంచార్జీ తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీఓ మోసిన్ బిన్ అహ్మద్, ఆర్‌ఐ శ్యాం, ఎస్‌ఐ శేఖర్, సర్వేయర్ లక్ష్మణ్ ఉన్నారు.

నాగార్జునసాగర్: ప్రజాపాలనలో భాగంగా జరుగుతున్న వార్డు సభలు నందికొండ మున్సిపాలిటీలో 2,6,11 వ వార్డుల్లో జరిగాయి. రేషన్‌కార్డులు కావాలని 47మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. ప్రజాపాలనలో రెండు రోజుల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు 178 దరకాస్తులు వచ్చినట్లుగా అధికారులు తెలిపారు.

పెద్దవూర: మండలంలో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని నాయినివానికుంటతండా, గర్నెకుంట, వెల్మగూడెం, పెద్దగూడెం, లింగంపల్లి, పొట్టివానితండా గ్రామాల్లో ప్రజాపాలనలోని నాలుగు పథకాలకు గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా ఏ ప్రాతిపదికన తయారు చేశారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని, ఎంపీడీవో సుధీర్‌కుమార్, ఏవో సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దీక్షిత్, హఫీజ్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలో ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. వర్ధమానిగూడెం, గాజినగర్ వంటి పలు గ్రామాల్లో గ్రామ సభలో అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 77, రేషన్ కార్డుల కోసం 139, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 32 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ బాలరాజురెడ్డి తెలిపారు.

డిండి: ప్రభుత్వాదేశాల మేరకు సంక్షేమ పథకాలను అందించేందుకు నిర్వహిస్తున్న సభలు మండలంలో బుధవారం కొనసాగాయి. మండల పరిధిలోని టి.గౌరారంలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ ఆంజనేయులు హాజరై మాట్లాడారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి

వేములపల్లి: అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందేలా కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వేములపల్లి, లక్ష్మీదేవిగూడెం, మంగాపురం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ శారదాదేవి, పీఆర్ ఏఈ బిందు, ఎంపీవో లలిత, ఎంఏవో కిశోర్ నాయక్, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటాం

గుర్రంపోడు : గతంలోని ప్రజాపాలన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కొప్పోలు, పిట్టలగూడెం, తేనపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సభల్లో డిప్యూటీ తహసీల్దార్ ఫరీదుద్దీన్, ఎంపీఓ పద్మ పాల్గొన్నారు.

> **గ్రామసభల్లో ఆందోళనలు**
>
> **పెద్దఅడిశర్లపల్లి :** ఉమ్మడి మండలంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన సభల్లో పలు గ్రామాల్లోని ప్రజలు ఆందోళనకు దిగారు. గుడిపల్లి మండల కేంద్రంలో అర్హులకు న్యాయం జరగడం లేదంటూ ధర్నా నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికలో ఏకపక్షంగా వ్యవహరించారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామంలో సైతం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బుధవారం జరిగిన గ్రామ సభల్లో ఉమ్మడి మండలంలో 967 మంది ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు.
>
> 
>
> గుడిపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు